# నా ప్రియురాల్ని కలుసుకున్నాను!

÷ రచన: శ్రీ. కలగర్ల కృష్ణమూర్తి. ÷

సముద్రం హోరుమని ఘోషిస్తోంది. భానుడు తన కర్తవ్యాన్ని ముగించుకొని అంభుధిలోనికి కృంగిపోతున్నాడు. చీకటి తెరలు తెరలుగా వ్యాపిస్తోంది. నేను బీచి రోడ్డుపై నిర్లిప్తంగా నడుస్తున్నాను. టక్కున ఆగిపోయాను. నా కాలికి ఏదో వస్తువు తగిలి బంతిలా పైకెగిరి, తిరిగి నేల మీద పడిపోయింది. ఏవిటాఅని విస్తుపోయి ఆ వస్తువును, వంగి నా చేతుల్లోకి తీసుకున్నాను అది స్త్రీల హేండ్‌బాగ్ నల్లగా, జిగ జిగ మని మెరుస్తూ చాలా అందంగా ఉంది.

చుట్టూ పరికించి చూసాను. ఎవ్వరూ కనిపించలేదు, ఆ బాగ్ నాదికాదు దానిలో ఉండే వస్తువుల్ని వాడుకొనే అధికారం కూడా నాకులేదు. ఐనా ఏముందో చూద్దామని ఆ బేగ్ తెరచి చూసాను. లోని పన్నెండు పదిరూపాయల నోట్లు, రెండు ఐదు రూపాయల నోట్లు ఉన్నాయ్. ఇంకా ఒక ఫోటోల కట్ట, కొన్ని ఉత్తరాలు ఉన్నాయ్. దగ్గరగాఉన్న లైటు దగ్గరకు వెళ్లి చూసాను. ఫోటోలు చాలా అసభ్యంగా ఉన్నాయ్, ఒక యవ్వనంలో ఉన్న సుందరి, ఇంకో యువకుడు, వివిధ భంగిమల్లో నగ్నంగా, అర్ధనగ్నంగా, కౌగలించుకుంటూ, చుంబించుకుంటూ పూర్తి వెస్ట్రన్ క్లైమెట్‌లో తీయించుకున్న ఫోటోలవి. ఉత్తరాలు మెల్లమెల్లగా విప్పి చదివాను. లలిత అనే చిన్నది రామం అనే యువకునికిరాసిన ప్రేమలేఖలు, వాటికి రాజమండ్రినుండి వచ్చిన జవాబులు. ఆ ఉత్తరాలు చదివింతర్వాత నాకు బోధపడిందేవిటంటే, రామం, లలిత చాలా గాడంగా ప్రేమించుకున్నారని, ఒకరు లేకపోతె, వేరొకరు జీవించలేరని బోదపడింది.

ఉత్తరాల్ని, ఫోటోల్ని బేగ్‌లో పడేసి, ఈ బేగ్ ఎవరిదా, వాళ్ళకు దీన్ని తిరిగి ఎలా అందజేయడమా అని ఆలోచిస్తూ బేగ్‌ను రెండో వైపు త్రిప్పి చూసాను. ఒక చిన్న అరలో ఒక ప్లాస్టిక్ కార్డు కనిపించింది. కార్డు తీసి చదివాను "ఎమ్. లలిత, బి. ఏ. ఫైనల్ ఇయర్, గాంధీనగర్" అని కార్డులో ఉంది. ఐతే, ఈ బేగ్ ఆ లలిత అనే అమ్మాయిదే కావచ్చు. వెళ్ళి అందజేస్తే మంచిది. "అనుకుంటూ బయల్దేరాను"

"రెడ్ బిల్డింగ్" రెండంతస్థుల ముచ్చటైన భవనం, భవనం ముందున్న వాచరు నన్ను చూసి "ఏం కావాలి?" అన్నాడు.

"లలితగారితో అర్జంటుగా మాట్లాడాలి" అన్నాను నేను 'లలితమ్మగారు లేరు. పెద్దమ్మాయిగారు ఉన్నారు. వెళ్లి మాట్లాడండి' అన్నాడు వాడు. నేను తిన్నాగా హాల్లోనికి వెళ్ళాను. హాలంతా ఖరీదైన పర్నీచరుతో అలంకరింపబడి ఉంది. మెర్క్యురీలాంప్ వెలుతురుతో హాలంతా కళకళలాడుతోంది. పైన గిఱ్ఱున ఫాను తిరుగుతోంది.

'అమ్మా, నాన్నా ఉళ్లోలేదు. ఎవరు మీరు, ఏం కావాలి' అంటూ ఒక అధికారయుతమైన కంఠం వినిపించగానే తలెత్తి చూసాను. ఎదురుగా ఒక యువతి నిలబడిఉంది. ఆమెను నేను ఇదివరకు ఎక్కడో చూసాను ఎక్కడ చూసాను చెప్మా, అనుకుంటూ సాగింది. అకస్మాత్తుగా, ఆమె చక్కని ముఖం కోపంతో ఎఱ్ఱబారింది 'ఓ నువ్వా! ఆ నాడు నారీసేవాసదనందగ్గర, నన్ను అవమానించిన వాడివి నువ్వేకదూ! మళ్ళీ ఇక్కడికి ఎందుకు వచ్చా!వ్ నిన్ను చూస్తేనే అసహ్యంనాకు పో, అవతలికి పో. లేకపోతే దర్వాన్ని పిలిచి, మెడపట్టి బైటికి గెంటాల్సి ఉంటుంది''అందామె అహంకారంతో నిండిన ఆగ్రహంతో.

నా మనస్సు చివుక్కుమంది. ఆమెతో నా తొలి పరిచయం, నారీసేవాసదనం దగ్గరే అన్న విషయం కూడా అప్పుడే నాకు జ్ఞాపకం వచ్చింది.

'భవానీగారూ, వెళ్ళిపోక, మీ ఇంట్లో శాశ్వతంగా తిష్టవెయ్యడానికి గానీ, ఆ నాడు నారీసేవాసదనం దగ్గర జరిగిన విషయానికి క్షమాపణ కోరుకోడానికి గానీ

నేను మీ దగ్గరకు రాలేదు. మీ కుటుంబ గౌరవానికి సంబంధించిన ఒక ముఖ్యమైన వస్తువును మీకు అందజేద్దామని వచ్చాను' అన్నాను నేను. ఆమె నావంక గర్వంగా చూస్తూ 'నువ్వు బ్లాకు మెయిలర్ గా' అంది.

ఆ ఒక్క మాటతో నా హృదయాన్ని ఎవరో పెట్రోలుపోసి కాల్చినట్లయింది.

'భవానీదేవీ! నేను మీ ఇంటికి మంచి మనసుతో వచ్చాను. ఇంతవరకూ మీరు నాకు చేసిన అవమానం చాలు. నేను ఆ నాడు నారీసేవాసదనం దగ్గర మీకేదో అవమానం చేసానని మీ భావన. ఒక దిక్కూలేని అడది ఏడుస్తూవచ్చి 'అమ్మా! చంటిపిల్ల ఆకలితో ఏడుస్తోంది. ఏమైనా ఇప్పించండమ్మా' అంది. నారీసేవాసదనం దగ్గర, మీరూ, మీ స్నేహితురాల్లు కలసి ఆ అమాయకురాల్ని, ఆ దిక్కూలేని దాన్ని హాస్యం చేస్తూ, మరింత దుఃఖపెట్టారే కాని, ఒక్కరూ కూడా, మీ తోటి అబల మీద జాలి చూపి, ఒక్క కానీ ధర్మం చెయ్యలేదు. పైగా మీరు నారీసేవాసదనం సెక్రెటరీ, మీ స్నేహితురాండ్రు సభ్యులున్నూ ఈ సంఘటన వింటే ఎవరైనా మిమ్మల్నే ఛీ అంటారు. అందువలన మీరలా ప్రవర్తించటం బాగులేదని ఆ నాడు మీతో అన్నాను. అంతేగానీ మిమ్మల్ని అవమానించాలని కాదు. పైగా ఈ నాడు మీ మనసు నాకు పూర్తిగా బోధపడింది. ఇంటికి వచ్చిన అతిథిని కూర్చోమని చెప్పటం కూడా మీకు చేతగాదు. చాలా థ్యాంక్స్. ఇదిగో ఈ హేండ్ బాగ్ నాకు బీచిలో దొరికింది. ఎడ్రస్ చూస్తే, మీ చెల్లెలు గారిదిలా ఉంది. ఇందిలో ఆమె తన లవర్‌తో కలసి తీయించుకున్న నగ్నమైన ఫోటోలు ఆమె వ్రాసిన ప్రేమ లేఖలు ఉన్నాయ్. ఇకనైనా, ఇటువంటి విలువైన వస్తువుల్ని రోడ్డు మీద పారేసుకోవద్దని, మీ చెల్లెమ్మగారికి చెప్పండి. వస్తా!' అంటూ ఆ హేండ్ బాగ్‌ను సోఫాలోనికి విసరేసి బైటకు వచ్చేసాను.

వెనక్కి తిరిగి చూడకుండా, సాధ్యమైనంత వేగంగా నడుచుకుంటూ వెళ్ళిపోయాను. కొన్ని రోజులు యథాలాపంగా గడచి పోయాయ్. నేను పని చేస్తున్న ఫ్యాక్టరీలో సమ్మె ప్రారంభమయింది. పనివారికి బోనసులివ్వాలని, జీతాలు పెంచాలని ఆందోళన లేవదీసారు. ఆ సమ్మెకు నేనే నాయకుణ్ణి. యజమానులను కలుసుకొని, పనివారల కష్టసుఖాలను వివరించాను. వాళ్ళ కోరికలు న్యాయసమ్మతమైనవని, వాటిని అంగీకరించడం యజమానుల ధర్మమని వివరించాను. యజమానులు అంగీకరించారు. పనివాళ్ళ కోర్కెలు తీరినాయ్. కానీ ఒక నెల రోజుల తర్వాత నన్ను ఉద్యోగంలో నుండి తొలగించారు. నేను ఫాక్టరీ డబ్బు ఏదో తిన్నానని నింద వేసారు. నా నిర్దోషిత్వాన్ని నేను నిరూపించుకోలేక పోయాను. పనివాళ్ళను వెనకేసుకొని, వాళ్ళ కోసం సమ్మె సాగించి, ఆందోళన సాగించాననే కోపంతోనే, యజమానులు నన్నిలా శిక్షించారని ఆ తర్వాత నాకు బోధపడింది. అంతేకాక, ఊర్లో మిగతా కంపెనీవాళ్లు కూడా, నాకు ఉద్యోగం ఇవ్వడానికి సిద్దపడలేదు. నేను పనివాళ్ళను రెచ్చగొడతానని, సమ్మెలు చేయిస్తాననే భావం, ప్రతీ యజమానిలో పాతుకుపోయింది.

రోజులు గడచిపోతున్నాయ్. నాకెక్కడా ఉద్యోగం దొరకటంలేదు. చేతిలో ఒక్క నయాపైసాకూడా లేదు. అప్పుడప్పుడు మంచినీళ్ళతో కడుపు నింపుకుంటున్నాను. పస్తులతో కడుపు మండిపోతూఉంది. అమ్మకోడానికి నాదగ్గర ఇంకేమీలేదు ఒక్క వెండిమెడల్ తప్ప. నా సత్ప్రవర్తనకు మెచ్చి కాలేజీలో ఒకనాడు పదిమందీ యెదుట నన్ను మెచ్చుకుంటూ, కాలేజీకమిటీ నాకు ఆ వెండిమెడల్‌ను ఇచ్చింది. ఇన్నాళ్లు దాన్ని అమ్మకుండా యింట్లో ఉంచగలిగాను. కానీ యిప్పుడు వేరే గత్యంతరంలేదు. ఆకలితో నరాలు పీకుతున్నాయ్ అమ్ముకొని, ముందు కడుపుమంట తీర్చుకోవాలని నిశ్చయించుకున్నాను.

తిన్నగా ఒక నగల దుకాణంలోనికి ప్రవేశించి, మెడల్‌ను తీసి అమ్మబోతున్నానని చెప్పాను. వాళ్ళు ఫేలవంగా నవ్వి ఆ మెడల్‌ను పరీక్షించి 'అరతులం వెండి ఉండవచ్చు. రూపాయిపావలా ఇస్తాం' అన్నారు. నా సత్ప్రవర్తన, విలువ రూపాయిపావలా అనుకుంటూ సరే ఇవ్వండి అన్నాను. 'ఇలారా' అంటూ పిలిచి కేషియర్ నాచేతిలో రూపాయిపావలా ఉంచాడు.

నేను ఆ డబ్బుల్ని జేబులో వేసుకొని వెళ్ళిపోదామని వెనక్కి తిరిగాను. నా ఆశ్చర్యానికి తగ్గట్టు నా యెదురుగా భవానీ నిలబడివుంది. ఆమె నావంక ఆశ్చర్యంగా చూస్తూవుంది. నేను వెళ్ళిపోదామని రెండడుగులు వేసాను. ఆమెకూడా నన్ను అనుసరిస్తూ వచ్చింది. 'మిష్టర్! ఒక్కమాట!' అందామె.

'ఏమిటి?' అంటూ నేను తిరిగి ఆమెవంక చూశాను. ఆమె నావంక చాలా జాలిగా చూసి, 'బాగా చిక్కిపోయారు. మిమ్మల్ని చప్పున పోల్చుకోలేకపోయాను. ఒంట్లో బాగోలేదా' అంది.

నా పేదరికం, మాసినదుస్తులు, ఆకలితో దహించుకుపోతున్న నా శరీరం, ఇవన్నీ చూడగానే, నన్ను వెక్కిరించాలనే కోరిక ఆ అమ్మాయికి కలిగింది కాబోలు. ధనానికి, లేమికి యెంత భేదం. యెంత విరోధం. అకస్మాత్తుగా నేను సిగ్గుతో తలవంచుకున్నాను.

'భవానీగారూ! నన్నిలా అవమానించడంవల్ల మీకు ఒరిగేది యేమిటో నాకు అర్థంకావటంలేదు. ఐనా మీరు నన్ను వెక్కిరించనక్కర్లేదు. నేనే చెబుతున్నాను వినండి. ప్రస్తుతం నేను నిరుద్యోగిని, చేతిలో చిల్లిగవ్వ లేనివాణ్ని, చాలా పేదవాణ్ని, ఆకలితో మలమల మాడిపోతున్నవాణ్ని. కడుపుమంట తీర్చుకోవడంకోసం గుడ్ కాండక్ట్ మెడల్ అమ్ముకున్న ఒక అభాగ్యుణ్ని. 'ఇహ చాలా హాయిగా ఆనందించండి' అంటూ వెళ్ళిపోదామని ముందడుగువేశాను. 'నన్ను సహృదయంతో అర్థంచేసుకొని, జరిగినదానికి క్షమించలేరా మూర్తిగారూ' అంటూ భవాని యెంతో అభిమానంగా నాతో అంది.

నేను ఆశ్చర్యంతో ఆమెవంక చూశాను. ఆమె సిగ్గుతో తలవంచుకొని ఉంది. ఆమె కంటిలో కన్నీటి బిందువులు మెరుస్తున్నాయి. ఈమె పూర్వపు భవానీయేనా, కాదా అనిపించింది నాకు. ఆనాటి అహంభావంగానీ, ఆగ్రహంగానీ ఆమెలో మచ్చుకైనా కనిపించటంలేదు. కడిగిన మంచి ముత్యంలా, ఆమె వదనం మంచితనంతో నిండి మెరిసిపోతూవుంది.

'నా కార్లో ఒక్కసారి రండి. మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి' అందామె.

'ఫరవాలేదు. నడిచేవస్తాను. మిమ్మల్ని యెక్కడ కలవాలో చెప్పండి చాలు' అన్నాను.

ఆమె నావంక ప్రాధేయపూర్వకంగా చూస్తూ, 'ప్లీజ్! రండి! మీరిప్పుడు రాకపోతే, నేను చాలా ఫీలవుతాను' అందామె.


MOTORS SEI PUMPS





- Excellant Performance.
- Low Current Consumption.
- Long Life.

OUR RANGE OF PRODUCTS

- Electric Motors, Single Phase ¼ H. P. to 2 H. P. 3 Phase ½ H. P. to 20 H. P.
- Centrifugal Pumps.
- Domestic Pumps
- Monoblock Sets (3 H. P. to 10 H. P.)

MANUFACTURERS

SOUTHERN ENGINEERING INDUSTRIALS.

343, AVANASHI ROAD : : COIMBATORE-1.

Branch : 30, THAMBUCHETTY STREET, MADRAS-1.

నేను మౌనంగా ఆమెను అనుసరిస్తూ వెళ్ళాను.

ఆమె కారు డోరు తెరచి 'రండి, కూర్చోండి' అంది.

నేను నిరాశగా ఆకాశంవంక చూస్తూ, 'నా బట్టల నిండా దుమ్ము, దూళి నిండివుంది. నేను కూర్చుంటే మీ కారు సీట్లు పాడుకావచ్చు' అన్నాను.

ఆమె చిన్నబోయి నావంక చూసి, 'అంటే, మీ కింకా నామీద కోపం పోలేదన్నమాట! నన్ను క్షమించండని మళ్ళీ ప్రార్థిస్తున్నాను' అంది.

నేను మౌనంగా వెళ్ళి కారులో కూర్చున్నాను. ఆమె నాప్రక్కనే కూర్చొని కారు డ్రైవుచేస్తోంది. కారు నడుస్తూవుంది. నేను యథాలాపంగా ఆమెవంక చూసాను.

ఆమె తెల్లని శరీరచ్ఛాయకు తగ్గట్టు లైట్ బ్లూ నైలాన్ చీర కట్టుకుంది. పసుపుపచ్చని వాయిల్ బ్లౌజు ధరించింది. మెడలో ఒంటిపేట సన్ననిగొలుసు వేసుకుంది. యౌవనం, అందం, సిరిసంపదలు ఆమె స్వంతం కావడంచేత, ఆమె యెంతో చూడ ముచ్చటగావుంది. కారు కుదుపుకు అప్పుడప్పుడు ఆమె మెత్తని శరీరం నాకు తగులుతుంటే, నా హృదయం యేవేవో తీయని భావాలలో తేలిపోతోంది. అప్రయత్నంగా, ఆమె భుజంమీద చెయ్యివేసి, అరచేత్తో ఆమె భుజాన్ని నొక్కాను. వెంటనే తప్పిదాన్ని గ్రహించి, గభాలున చెయ్యి తీసేశాను.

ఆమె నవ్వుతూ నావంక చూసి, 'ఆకలిగా ఉందా?' అంది.

నేను ఆమెవంక చూడలేక తలవంచుకొనే, 'ఊఁ' అన్నాను మెల్లగా.

ఆమె కారును స్పీడుగా పోనిచ్చింది. 'హోటల్ హనీమూన్' వద్ద కారు ఆపింది. నన్ను కార్లో కూర్చోమని చెప్పి, ఆమె దిగివెళ్ళింది. కొద్దిసేపట్లో ఒక సూట్‌వాలాను వెంటబెట్టుకొని వచ్చింది. తిరిగి నాదగ్గరకు వచ్చి 'మరేం భయపడకుండా, ఆ సూట్‌వాలాతో కలసి వెళ్ళండి. బాగా స్నానంచేసి డ్రస్‌మార్చుకొని రండి, ఆనక అతడే మిమ్మల్ని నాదగ్గరకు తీసుకొస్తాడు' అంది.

నాకంతా అయోమయంగా వుంది. ఇంతలోనే ఆ సూట్‌వాలా ఆ కారుతలుపు తెరచి, 'దయచేయండి సార్!' అన్నాడు యెంతో మర్యాదగా. ఏంచెయ్యాలో తోచక నేను భవానీవంక చూశాను.'' ఆమెనవ్వుతూ నా వెంపతట్టి వేగంగా వెళ్ళిరండి. నేను మీకోసం యెదురుచూస్తూ వుంటాను' అంది.

ఒక్క అరగంటలో నా స్వరూపమే మారిపోయింది. అంతవరకూ ఉన్న చిన్నగడ్డం నున్నగా ఊడిపోయింది. వెచ్చనినీళ్ళలో పూర్తిగా అభ్యంగనస్నానం చేశాను. క్రాపు సరిగా కత్తిరించుకొని, బిల్‌క్రీమ్ పట్టించి, చక్కగా దువ్వుకున్నాను. వైట్ ఫాంట్ మీద అమెరికన్ జాకెట్ టక్కు చేసుకున్నాను. ముఖానికి స్నో పవుడరు పట్టించాను. అంబాసిడర్ బూటు వేసుకున్నాను. ఇదంతా చేయించింది ఆ సూట్‌వాలాయే. ఈ డబ్బంతా యెవరిస్తారో యేమో! నేనేమైనా అడిగితే 'మీరేం కంగారుపడకండి' అని మాత్రం వాడు నాకు సమాధానం యిచ్చాడు.

'హోటల్ హనీమూన్' లో రూం నెంబరు 165 దగ్గరకు నన్ను ఆ సూట్‌వాలా తీసుకుపోయి 'ఇదే సార్, మీ భవానీగారు ఉండే గది. తలుపు తట్టండి. ఆమెవచ్చి తలుపుతీస్తారు. ఇక నే వెళ్తా' అంటూ వాడు వెళ్ళిపోయాడు.

నేను సంకోచంతో మెల్లగా రూంతలుపు తట్టాను. మెల్లగా తలుపు తెరచింది భవానీ. నేను లోనికి వెళ్ళగానే, ఆమె రూం తలుపు మూసి, తన హేండ్‌బాగ్‌లో నుండి ఒక వాచీ తీసి, తానే స్వయంగా నా యెడం చేతికి ఆ వాచీని అలంకరించింది.

'ఈ క్షణంనుండీ నన్ను మీరు భవానీ అని పిలిస్తే చాలు. మీరనిగానీ, భవానీగారూ అనిగానీ పిలిస్తే ఒప్పుకోను' అందామె చిరుకోపంతో.

ఆమె చూపుతున్న అభిమానానికి తట్టుకోలేక నేను ఆ అందాలరాణీ నడుంచుట్టూ నా రెండుచేతుల్నీ పోనిచ్చి దగ్గరగా లాక్కున్నాను. హృదయానికి చేరువ కాగానే, "నిన్ను ప్రేమిస్తున్నాను భవానీ. ఇంతవరకూ ఏమోగానీ, ఇకమీద నువ్వు కాదంటే బ్రతకలేనేమో ననిపిస్తోంది" అని నా మనసులోని మాటను బైట పెట్టేశాను.

ఆమె నవ్వుతూ లతల్లాంటి తన చక్కని తెల్లని హస్తాల్ని నా భుజాలమీద వేసి 'ఆకలిగా లేదూ' అంటూ కిలకిలా నవ్వి, నన్ను తనతో యింకో చిన్న రూంలోనికి తీసుకువెళ్ళింది.

ఎదురుగా టేబిల్‌పై, రెండు ప్లేట్లలలో, ఆపిల్ ముక్కలు, మైసూర్‌పాక్, బొంబాయి హల్వా, గులాబ్ జాంలు వున్నాయ్. ఇంకో రెండు ప్లేట్లలో భోజనం,

పొగలుగ్రక్కుతున్న సాంబారు, వెజిటబుల్స్, పెరుగు సిద్ధంగా వున్నాయ్.

ఇద్దరం చెరో కుర్చీమీద కూర్చున్నాం.

బాగా ఆకలిగా వుండేమో! తొందరగా భోజనం మీదకు దాడిచేశాను. ఆదరాబాదరగా భోజనం పూర్తి చేశాను. బ్రేవ్‌మని తేన్చి, భవానీవంక చూశాను. 'థ్యాంక్స్' అన్నాను.

ఆమె నవ్వుతూ నా భుజంమీద చెయ్యివేసి, 'మీరు నాకళ్ళు తెరిపించారు మూర్తిగారూ! నారీ సేవాసదనం దగ్గర మీరు నాకు తగినట్లు బుద్ధిచెప్పారు. మా లలిత ఫోటోలు, ప్రేమలేఖలు యిచ్చి మా పరువు కాపాడారు. లోకంలో డబ్బుకోసం ముఖస్తుతులు చేసి, మెప్పించిన వారిని చూశానుగానీ, మీలా యదార్థాన్ని అచ్చుగుద్దినట్లు ముఖాన్నే చెప్పి, మనసును మార్చేవారిని చూడలేదు. మీకెలా కృతజ్ఞత చెప్పుకోవాలో నాకు తెలియటంలేదు.'

ఆమె తన్మయంలో కళ్లు మూసుకుంది. నేను మెల్లగా లేచి ఆమెదగ్గరకు వెళ్ళి, గబాలున ఆమె కుడిబుగ్గను ముద్దుపెట్టుకున్నాను.

"అబ్బా! ఏమిటిది" అంది నా భవానీ తెచ్చిపెట్టుకున్న కోపంతో.

నేను ఆమెను మరింత దగ్గరగా తీసుకొని, 'కృతజ్ఞత యెలా చెప్పుకోవాలో తెలియదన్నావుగా! అందుకే తెలియజేశాను. బాగుందా!' అన్నాను.

'ఊహూఁ' అందామె సిగ్గుతో తలవంచుకొని, చందమామలా నవ్వుతూ.

"నన్ను పెళ్లిచేసుకుంటూరా, నేస్తం గారూ!" అన్నాను నేను.

ఆకాశంలో చంద్రుడు నిండుగా ఉదయిస్తున్నాడు పండువెన్నెలలో జగతి జలక్రీడలాడుతోంది. నైట్ క్వీన్ సువాసనలతో నిండిన మలయమారుతంతో, హోటల్‌గదంతా చల్లగా హాయిగావుంది. భవానీ కొప్పులోని మల్లెలు అప్పుడే విడి, గుప్పుమని పరిమళాన్ని వెదజల్లుతున్నాయ్. భవానీ! నా జన్మజన్మల పూజా ఫలం. నా జీవనసామ్రాజ్యాన్ని పులకింపజేయవచ్చిన దివ్యరమణి. ఆమెను అలాచూస్తుంటే నాకు స్వర్గమే కదలివచ్చినట్టనిపించింది. భవానీలేని లోకంలో నేను జీవించగలనా! ఆ అందాలరాణి నాకు దక్కకపోతే నేను బ్రతకగలనా? నాలోని ప్రతీఅణువు ఆ క్షణంలో భవానీనే ఆరాధిస్తూవుంది. నా మనస్సు భవానీరూపుతో నిండిపోయింది. భవానీ నాది. ఆమె నాకోసమే జన్మించిందేమో! అప్రయత్నంగా నా కంటినుండి ఆనంద భాష్పాలు రాలినాయ్.

'ఏమిటిది! ఎందుకా కన్నీళ్ళు!' అంటూ భవానీవచ్చి తన చీరచెంగుతో నా కన్నీళ్ళు తుడవసాగింది.

భవానిని ప్రేమతో గట్టిగా కౌగలించుకొని 'నన్ను విడిచివెళ్ళనని వాగ్దానంచెయ్యి భవానీ. నీ రూపుతో, చూపుతో, అభిమానంతో నా హృదయం నిండిపోయింది. నువ్వు నన్ను విడిచిపోతే, నేను చచ్చిపోతాను భవానీ' అన్నాను.

భవానీ మెల్లగా, తీయగా నా చెంపమీద కొట్టి 'మరేం భయపడకండి నేస్తం. మీరూ, నేనూ శాశ్వతంగా నేస్తం కట్టుకుందాం. అమ్మా, నాన్నాకూడా ఏనాడో ఒప్పుకున్నారు' అంది.

దూరాన, యెక్కడో కోయిల తీయగా కూసింది.



1965 కాలండర్లు

కొండయ్యరాజు, రవి, మొదలగు చిత్రకళారాధకులచే చిత్రించిన, దేవుళ్ళ పఠములు సినిమా తారల పఠములు. అన్నిరకములలోనూ, అన్ని సైజులలోనూ సిద్ధముగా ఉన్నవి. ఏజెంట్లులేని ఊళ్ళలో ఏజెంట్లు కావాలి.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీలోనే)

→ వివరములకు ←

SRI KALA TRADERS,
(opp. Nadar Lodge)
P. B. No. 119 : : SIVAKASI. (S.I.)